క్లుప్తంగా

విద్యుత్ షాక్ బాధిత కుటుంబానికి వితరణ



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న స్నేహితులు

మునగపాక : విద్యుత్ షాక్‌కు గురై ఇటీవల మృతి చెందిన సంతోష్ కుటుంబానికి స్నేహితులు బాసటగా నిలిచారు. మునగపాకకు చెందిన యువ రైతు దాడి సంతోష్ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. దీంతో సంబంధిత బాధిత కుటుంబానికి బుధవారం స్నేహితులు రూ.50వేల మేర నగదు సాయం అందించేందుకు ముందుకొచ్చారు. కాండ్రేగుల గణేష్, ఆడారి గణేష్, సూరిశెట్టి భాను తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: స్థానిక వీవర్స్ కాలనీలో ఉన్న గణపతి ఆలయంలో బుధవారం సంకట హర చతుర్థి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు శేషాచార్యులు, అప్పలాచార్యుల ఆధ్వర్యంలో గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నక్కపల్లి వీవర్స్‌కాలనీ, బందారుపేట తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు ఈ పూజల్లో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

స్వచ్ఛ గణపర్తిగా తీర్చిదిద్దాలి



గణపర్తిలో పొక్లెయిన్‌తో తుప్పల తొలగింపు పనులు

మునగపాక: గణపర్తి గ్రామంలో శుభ్రత-పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా బుదవారం పొక్లెయిన్‌తో తుప్పల తొలగింపు పనులు నిర్వహించారు. జనసేన మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కాళ్ల చంద్రమోహన్ ఆధ్వర్యంలో గ్రామంలో రహదారులకు ఇరువైపులా పేరుకుపోయిన తుప్పలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. స్వచ్ఛ గణపర్తికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో జన సైనికులు కలగా గంగాధర్, నవీన్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పూర్వ విద్యార్థుల తోడ్పాటు



గ్రంథాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం : దార్లపూడి ఉన్నత పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు రమణశ్రీ అన్నారు. 1985-86 సంవత్సరంలో 10 వ తరగతి చదివిన విద్యార్థులు గ్రంథాలయానికి అవసరమైన సామగ్రి సమకూర్చడంతో గ్రంథాలయం ఏర్పాటు చేశామన్నారు. ఇది విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడల్లోనూ రాణించాలి



ఆటలాడుతున్న చిన్నారులు

మునగపాక : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎంఈవో-1,2లు వేణుగోపాలరావు,శివనాయుడు కోరారు. శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా బుధవారం క్రీడాదినోత్సవం నిర్వహించారు. గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే పలు క్రీడల విశిష్టతను వ్యాయామ ఉపాధ్యాయులు పిల్లలకు గుర్తు చేశారు.

తుపాను అ'రక్షిత' భవనాలు



అధ్వాన స్థితిలో రాజానగరంలోని తుపాను షెల్టర్



శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న పెద్దూరు తుపాను షెల్టర్



శిథిలావస్థలో వెంకటనగరం తుపాను షెల్టర్

పాయకరావుపేట : మండలంలో గల ఆయా తీర గ్రామాల్లో తుపాను రక్షిత భవనాలు శిథిలావస్థకు చేరాయి. మండలంలో గల కుమారపురం గ్రామ శివారు పెద్దూరు రత్నయ్యమ్మపేటలో తుపాను షెల్టర్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ తుపాను రక్షిత భవనం వద్దనే ప్రాథమిక పాఠశాల వుంది. పాఠశాలలో విద్యార్థులు ఈ తుపాను షెల్టర్ కిందనే ఆడుకుంటున్నారు. పైగా పాఠశాల ఆవరణలోనే ఉండడం కారణంగా అది ఏ క్షణంలో కూలుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. అదే విధంగా వెంకటనగరం గ్రామంలో వున్న శిథిలావస్థకు చేరిన తుపాను రక్షిత భవనం కూడా ప్రాథమిక పాఠశాల ఆవరణలోనే వుంది. ఈ భవనం నుంచి పెద్ద పెద్ద పెచ్చులు ఊడి పడుతుంటాయి. దీంతో అక్కడ ఉపాధ్యాయులు, గ్రామస్తులు కూడా భయాందోళన చెందుతున్నారు. అదే విధంగా వెంకటనగరం శివారు గ్రామం రాజానగరంలో వున్న తుపాను షెల్టర్ భవనం కూడా శిథిలావస్థకు చేరింది. ఇక్కడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోనే ఉంది. ఎన్నో సంవత్సరాలుగా శిథిలావస్థకు చేరి నిరూపయోగంగా ఉండడమే కాక, ఈ మూడు భవనాలు కూడా పాఠశాలల ఆవరణలోనే ఉన్నాయి. దీంతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు భయాందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న తుపాను రక్షిత భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై మండల విద్యాశాఖ అధికారి కె.ఎస్.గాంధీని సంప్రదించగా వీటిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపించడం జరిగిందని, ఇంతవరకు అధికారులు వీటి పై చర్యలు తీసుకోలేదని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య



వెంకటాపురం ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం అందించిన దృశ్యం

రాంబిల్లి(యలమంచిలి) : ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన విద్య అందుతోందని వెంకటాపురం ఎంపీయూపీ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ధూళి నానాజీ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో శిక్షా సప్తహ కార్యక్రమంలో భాగంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. శిక్షా సప్తహ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు విద్య పట్ల ఆసక్తి పెంచడంతో పాటు వారిలో విజ్ఞానం, సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికి తీసే అవకాశం కలుగుతుందన్నారు. ఎంతో నైపుణ్యం , ప్రతిభ కలిగి ఉన్న ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్నారని, అన్ని వర్గాల ప్రజలు ఇపుడు ప్రభుత్వ పాఠశాలల పట్ల ఆసక్తి చూపుతున్నారని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించి డిజిటల్ విద్యను కూడా ప్రవేశపెట్టిందని తెలిపారు. అలాగే ప్రస్తుత ప్రభుత్వం అందించే సదుపాయాలు వినియోగించుకుని ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేశారు.

విద్యుత్ సమస్యలపై అధికారుల స్పందన

సాక్షి ఎఫెక్ట్..



స్తంభం చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించిన దృశ్యం

మునగపాక : మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాల చుట్టూ పేరుకుపోతున్న మొక్కలు, అలాగే ఇళ్ల పక్కగా విద్యుత్ వైర్ల కారణంగా ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో సాక్షి దినపత్రికలో బుధవారం 'వేలాడుతున్న యమపాశాలు' శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మునగపాక నందీశ్వర ప్రాంగణం దరి విద్యుత్ స్తంభం చుట్టూ పేరుకుపోయిన తుప్పలను తొలగించారు. అలాగే గణపర్తిలో కర్రి మల్లేశ్వరరావు ఇంటి పక్కగా వైర్లు వెళ్లడంతో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు విద్యుత్ తీగలను మార్చేందుకు మీ-సేవా కేంద్రంలో గాని సచివాలయంలో గాని దరఖాస్తు చేసుకోవాలని సూచనలు చేశామని ఏపీఈపీడీసీఎల్ ఏఈ ఎస్.గోపి తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ అధికారులు స్పందించడం పట్ల వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మిత్ర బృందం...ఆపన్న హస్తం



ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కోటవురట్ల : తమ మిత్రుడు ఆపదలో ఉంటే మిత్ర బృందం వెంటనే స్పందించింది. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మిత్రుడికి మేమున్నామంటూ ఆపన్న హస్తం అందించింది. కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్లో 2002-03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన సుర్ల నూకరాజు కుమార్తె బ్రెయిన్‌కు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ గత 15 రోజులుగా విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మిత్రుని గురించి పూర్వ విద్యార్థులు తెలుసుకున్నారు. వెంటనే అతని ఇంటికి వెళ్లి రూ.20 వేలు నగదు అందించి భరోసా కల్పించారు. మిత్రుల సహాయానికి నూకరాజు కృతజ్ఞతలు తెలిపారు. మిత్రునికి సాయం అందించిన వారిలో పద్వార అర్జునరావు, మాకిరెడ్డి నగేష్, కె.జయబాబు, ఎ.శ్రీరామ్మూర్తి, పైల వరలక్ష్మి, రావాడ బాబ్జీ, నరేంద్ర ఉన్నారు.

విద్యార్థులకు గ్రామీణ ఆటల పోటీలు



చిన దొడ్డిగల్లు జెడ్పీ పాఠశాలలో గ్రామీణ ఆటల పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు

నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సప్తాహ కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. జాతీయ విద్యా విధానం 2020 ఏర్పాటు చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఏడిద వెంకటరమణ తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రధానోపాధ్యాయులు కవిత పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మరుగున పడిన తొక్కుడు బిళ్ల, ఇసుక పల్లా, దాగుడు మూతలు, అష్టాచెమ్మా, కర్ఫకాయలు ఆట, ఏడు పెంకులు ఆట, గల్లా గరిక మొదలైన ఆటలు ఆడించడం జరిగిందన్నారు. విద్యార్థులు ఉల్లాసంగా ఆటల్లో పాల్గొన్నారని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఆదిలక్ష్మి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సాపురం ఎంపీడీవో మృతికి సంతాపం



మృతి చెందిన ఎంపీడీవోకు నివాళులర్పిస్తున్న మండల పరిషత్ సిబ్బంది

యలమంచిలి రూరల్ : పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం ఎంపీడీవో ఎం. వెంకటరమణారావు బలవన్మరణానికి పాల్పడడంపై యలమంచిలి ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది కార్యాలయం ఎదుట బుధవారం సాయంత్రం సంతాపం తెలుపుతూ నివాళులర్పించారు. పలువురి ఒత్తిళ్ల కారణంగానే ఎంపీడీవో ఆత్మహత్యకు పాల్పడ్డారన్న విషయం తమను కలచివేసిందని యలమంచిలి ఎంపీడీవో అప్పలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. వెంకట రమణారావు ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. వారంతా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎంపీడీవో ఆత్మహత్యకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని, అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అరబుపాలెంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక:మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కోరారు. అరబుపాలెంలో ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా కుట్టు శిక్షణ ద్వారా వచ్చే ఆదాయంతో మెరుగైన జీవితం సాధించాలన్నారు. ఫౌండేషన్ ప్రతినిధి శ్రీకాంత్, శరగడం బిందు, ట్రైనీ టీచర్ మహలక్ష్మమ్మ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల వితరణ



నోట్ పుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోటవురట్ల : శ్రీ సత్యసాయి యూనివర్సల్ వెల్ఫేర్ గ్రూపు ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు. కొడవటిపూడిలోని ఎంపీయూపీ స్కూల్లో బుధవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ నిర్వహించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి స్థాయికి ఎదగాలని ట్రస్ట్ ప్రతినిధులు కోరారు. 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.కృష్ణప్రసాద్, ఎంపీటీసీ యలమంచి ప్రకాష్, సర్పంచ్ కోసూరు అప్పారావు, ట్రస్ట్ ప్రతినిధి శెట్టి విశ్వనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గంగాలమ్మతల్లి గుడికి విరాళాల వెల్లువ



గంగాలమ్మతల్లి గుడికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : మూలపేటలో నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడికి పలువురు దాతలు తమ సహకారాన్ని అందిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగా మునగపాకకు చెందిన ఆడారి పరశురామ్-పైడితల్లమ్మ దంపతులు రూ.5,116 నగదును బుధవారం విరాళంగా అందజేశారు. అలాగే పాటిపల్లికి చెందిన కొయిలాడ త్రిమూర్తులు-ధనలక్ష్మి దంపతులు రూ.5,116 అలాగే మంగళవరపుపేటకు చెందిన సరిసా శ్రీనివాసరావు-గాయత్రి దంపతులు రూ.5,116 నగదును కమిటీ సభ్యులకు విరాళాలుగా అందజేశారు. సర్పంచ్ గంగప్పలనాయుడు, కమిటీ సభ్యులు కాశీ , నాగేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.


వీధి రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు



రోడ్ల నిర్మాణానికి కొలతలు తీస్తున్న ఏఈలు

నక్కపల్లి: స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో పలు వీధి రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు ఏఈ నరేంద్ర తెలిపారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దేవదాయ శాఖకు చెందిన స్థలాన్ని కొనుగోలు చేసి నక్కపల్లికి చెందిన సుమారు 300 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఇందిరమ్మ పథకంలో ఇళ్లు కూడా మంజూరు చేశారు. దాదాపు 200 మందికి పైగా ఇక్కడ లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ఈ కాలనీలో వీధి రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ బీజేపీకి చెందిన నేతలు కోసూరు శ్రీను తదితరులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏఈ నరేంద్ర, వెంకటేష్ బుధవారం కాలనీలో పర్యటించారు. రోడ్లు వేయాల్సిన ప్రాంతాల్లో కొలతలు తీసుకోవడం జరిగిందని, వీటి మంజూరుకు సంబంధించి ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపించడం జరుగుతుందని ఏఈలు తెలిపారు. స్థానిక నాయకులు కోసూరు శ్రీను, నానిబాబు, సకురు స్వామి, అప్పన్న, కర్రి రవి, నాగు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధర్నాకు సంఘీభావం



గాంధీ విగ్రహానికి వినతి అందజేస్తున్న మునగపాక ఎంపీటీసీ-3 గణేష్

మునగపాక : రాష్ట్రంలో జరుగుతున్న మారణకాండకు వ్యతిరేకంగా ఢిల్లీలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ధర్నాకు సంఘీభావంగా మునగపాక-3 ఎంపీటీసీ బోడకుర్తి గణేష్ మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు సేవలందించాల్సింది పోయి ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలను లక్ష్యంగా చేసుకొని మారణకాండకు పాల్పడడం సరికాదన్నారు. హోం మంత్రి అనిత ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నో నీతులు చెప్పారని, నేడు ఇటువంటి నేరాలను ప్రోత్సహించడం తగదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా పని చేసిన కాలంలో ప్రజలకు మెరుగైన సేవలందించి గుర్తింపు పొందారని గుర్తు తెచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ఇటువంటి అఘాయిత్యాలు జరగకుండా చూడాలని గణేష్ కోరారు.

మణిరాజును పరామర్శించిన వైఎస్సార్‌సీపీ నేతలు



మణిరాజు ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న వీసం తదితరులు

నక్కపల్లి : వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజును స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు బుధవారం పరామర్శించారు. మణిరాజు గుండెకు సంబంధించిన సమస్యతో ఇటీవలే విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్నారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీలు వెలగా ఈశ్వరరావు, వీసం నానాజీ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు తదితరులు మణిరాజు ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. యాంజియోగ్రాం చేయించుకుని స్టంట్ వేయించుకున్న నేపథ్యంలో కొద్ది రోజులపాటు ఇంటి వద్దే విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మణిరాజు త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన మరో వైఎస్సార్‌సీపీ నేత అయినంపూడి సురేష్‌రాజు కూడా ఇటీవలే గుండెకు సంబంధించిన చికిత్స తీసుకుని ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నారు, ఆయనను కూడా వైఎస్సార్‌సీపీ నేతలు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయా నేతలను పరామర్శించిన వారిలో సర్పంచ్‌లు చినపేర్రాజు, తళ్ల భార్గవ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గోవిందు, ఎంపీటీసీ సత్తిబాబు, వార్డు సభ్యులు అల్లాడ కొండ, జి.బంగార్రాజు, కురందాసు నాని ఉన్నారు.

తైక్వాండో విజేతలకు అభినందన



తైక్వాండోలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం : తైక్వాండో పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన పెదగుమ్మలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు నిర్మల బుధవారం అభినందించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల సమక్షంలో ఈ విద్యార్థులకు సాధించిన మెడల్స్‌ను అందజేసి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయిలో 18 కేజీల విభాగంలో కిల్లాడ హిమబిందు గోల్డ్ మెడల్, అండర్ 40 కేజీల విభాగంలో కిల్లాడి నాగాంజలి సిల్వర్ మెడల్ సాధించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ బాలికలు తైక్వాండో వంటి క్రీడల్లో పాల్గొనడం ద్వారా వ్యక్తిగత రక్షణతో పాటు, శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్ పాపారావుకు వినతి అందజేస్తున్న రైతు ప్రతినిధులు

మునగపాక : అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కర్రి అప్పారావు కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపునకు గురైన నారుమడులకు సంబంధించి రైతులు 3వేలకు పైగా పెట్టుబడులు చేశారని, కొంతమంది రైతులు ఎద జల్లేందుకు ఎకరాకు రూ.15వేలకు పైగా పెట్టుబడులు చేశారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నష్టం అంచనా వేసి రైతులను ఆదుకోవాలన్నారు. వినతి అందజేసిన వారిలో సీఐటీయూ నేత ఎస్.బ్రహ్మాజీ, బీటీఆర్ అప్పారావు, మళ్ల జోగారావు, భీశెట్టి రాము తదితరులున్నారు.

అందరి కృషితో బాల్య వివాహాల నిర్మూలన



మిషన్ శక్తి ర్యాలీలో ఐసీడీఎస్ ఉద్యోగులు

అనకాపల్లి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అనకాపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ నిర్మలకుమారి, 7వ సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి ఉమ అన్నారు. ఐసీడీఎస్-సెక్టార్ 3 పరిధి స్థానిక మళ్లవీధిలో బుధవారం మిషన్ శక్తి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిషన్‌శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా జోన్ పరిధిలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా సాధికారత, బాలికా రక్షణ, భారత న్యాయసంహిత నందు ఆడపిల్లల రక్షణ చట్టాలు, ప్రధానమంత్రి మాతృవందన యోజన తదితర కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ర్యాలీలో సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులు ముత్తా శ్రీలక్ష్మి, ఎం.సౌజన్య, ఎంపీఎల్ సంతోషి, అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఒలింపిక్ క్రీడల్లో భారత్ మెరవాలి



క్రీడాకారులకు ఆల్ ద బెస్ట్ చెప్తున్న విద్యార్థులతో శిలపరశెట్టి బాబి

అనకాపల్లి: ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఈ నెల 26 నుంచి వచ్చే నెల 11 వరకూ జరగనున్న క్రీడల్లో భారత్ ఆటగాళ్లు ప్రతిభ కనబరిచి, పతకాలు సాధించాలని అనకాపల్లి బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ కార్యదర్శి శిలపరశెట్టి బాబి ఆకాంక్షించారు. 16 అంశాల్లో భారత దేశం నుంచి పోటీపడుతున్న 117 మంది క్రీడాకారులకు స్థానిక వీవీ రమణ రైతుభారతి హాల్లో విద్యార్థులతో కలిసి బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోక్యోలో జరిగిన 2019 ఒలింపిక్ క్రీడల్లో మన దేశ క్రీడాకారులు 7 పతకాలు సాధించారని, ఈసారి మరిన్ని పతకాలతో దేశ కీర్తిప్రతిష్టలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో వెయిట్‌లిఫ్టింగ్ ఒలింపియన్ ఎం.వి.మాణిక్యాలరావు, అసోసియేషన్ ప్రతినిధులు అమరపల్లి కృష్ణాజీ, కర్రి అప్పాజీ, దాడి శ్యామ్, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, కె.నాయుడు, గుండ్రపు నీల, మద్దాల సురేష్, దేముడు, విద్యార్థులు పాల్గొన్నారు.